క్లుప్తంగా

'చదువుతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్'


దొనబండలో విద్యార్థులతో మాజీ ఎంపీ వివేక్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం దొనబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం రఘునాథ్ వెరబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగు, నోట్‌బుక్స్, జామెట్రీ బాక్సుతో కూడిన స్కూల్‌కిట్‌లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కిట్‌లను బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీ వివేక్‌వెంకటస్వామి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి చేతుల మీదుగా అందజేశారు. చదువుతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, ఈ క్రమంలో ప్రతి విద్యార్థి పోటీతత్వంతో చదువుతూ ఉత్తమ ప్రతిభతో రాణించాలని సూచించారు. ఇకపై ఫౌండేషన్ నుంచి విద్యార్థులకు క్రీడల్లోనూ ప్రోత్సాహం అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తిరుపతి, వెంకటరమణారావు, స్వామిరెడ్డి, రాజేశ్, సాయికుమార్, రాకేశ్ పాల్గొన్నారు.

నోట్‌బుక్స్ పంపిణీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని ముల్కల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం గోనె నర్సింగరావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు గోనె సతీశ్‌రావు చేతుల మీదుగా విద్యార్థులకు ఉచిత ఫార్మటివ్ నోట్‌బుక్స్ పంపిణీ చేశారు.

డిక్షనరీలు పంపిణీ

నెన్నెల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మందమర్రికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయురాలు బొంకూరి అనసూయ జ్ఞాపకార్థంగా ఆమె కుమారులు బొంకూరి అరుణ్, ప్రదీప్, కిరణ్, సందీప్, కూతురు వినయకుమారి, అల్లుడు సీ.బాబ్జిలు ఇంగ్లిష్ డిక్షనరీలను మంగళవారం అందజేశారు. తమ తల్లి టీచర్ కావడం మూలంగా, ప్రతి సంవత్సరం ఆమె జ్ఞాపకార్థం విద్యార్థులకు ఏదో ఒక సాయం చేయాలని సంకల్పించుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అనసూయ మూడో వర్ధంతిని పురస్కరించుకొని, ఈ ఇంగ్లిష్ నిఘంటువులను అందజేశామన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

మంచిర్యాలఅర్బన్: కేజీబీవీ, యూఆర్ఎస్, సమగ్రశిక్షణలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోళ్ల రామన్న, రాజావేణు డిమాండ్ చేశారు. మంచిర్యాలలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ కనీసవేతనంతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని, ఈ నెల 20న చలో ఎస్పీడీ ఆఫీస్‌కు తరలిరావాలని పిలుపునిచ్చారు.

రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చెన్నూర్‌రూరల్: కాంగ్రెస్ పార్టీ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఉచిత కరెంటుపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా, మండలంలోని ఆస్నాద గ్రామంలోని రైతువేదిక వద్ద మంగళవారం బీఆర్ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మంత్రి బాపు మాట్లాడారు. రాష్ట్రంలో 24గంటల పాటు ఉచిత కరెంటు ఇవ్వడాన్ని చూసి, కాంగ్రెస్ పార్టీ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మోతె తిరుపతి, ఉప సర్పంచ్ నస్కూరి శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు మాదవరెడ్డి, వెంకటేశ్వర్‌రావు, నరసింహాచారి, తదితరులు పాల్గొన్నారు.

పత్తి పంటల పరిశీలన


చీడపీడలపై అవగాహన కల్పిస్తున్న ఏవో

కోటపల్లి: మండలంలోని పార్‌పల్లి గ్రామంలో పత్తి క్షేత్రాలను ఏవో మహేందర్ సందర్శించి, లేతదశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. చీడపీడలు ఉంటే వేపనూనే ఎకరానికి లీటర్ చొప్పున పిచికారీ చేసుకోవాలని సూచించారు. యూరియా, పొటాష్‌లను నాలుగు దఫాలుగా 20, 40, 60, 80రోజుల పంట కాలంలో నత్రజని 150కిలోలు, పొటాష్ 60కిలోలు, ఫాస్ఫరస్ 60కిలోలు వాడుకోవాలని ఎరువులను మొక్కకు కొద్ది దూరంలో భూమిలో వేసుకుంటే ఎరువుల వినియోగం బాగుంటుందని వివరించారు. కార్యక్రమంలో ఏఈవో రాజుకుమార్, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బురద కష్టాలు




పాఠశాలకు వెళ్లే రహదారిపై నిలిచిన నీరు

చిన్నపాటి వర్షం కురిసినా చాలు.. స్థానిక గాంధీనగర్‌లో సినిమావాడ ఉన్నత పాఠశాలకు వెళ్లాలంటే అష్టకష్టాలు పడాల్సి వస్తుంది. 2000సంవత్సరంలో పాఠశాలకు కొత్త భవనం నిర్మించినా, రహదారి సౌకర్యం కల్పించలేదు. బడిలో మొదట్లో 80మంది ఉన్న విద్యార్థుల సంఖ్య ప్రస్తుతం 240మందికి చేరింది. పాఠశాలకు సరైన రహదారి లేకపోవటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు పడరాని పాట్లు పడుతున్నారు. చినుకు పడితే చాలు అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితి. రహదారిపై కాలువ నీరు ప్రవహిస్తుండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు బురదలో అదుపుతప్పి గాయాల పాలవుతున్నారు. రహదారి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

- మంచిర్యాలఅర్బన్

రోడ్డు కష్టాలు ఇంకెన్నాళ్లో..!

భీమారం మండలంలోని పలు గ్రామాల్లో బురద కష్టాలు తప్పట్లేదు. వానొస్తే చాలు రోడ్డంతా బురదమయంగా మారి, ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. అధికారులను, ప్రజాప్రతినిధులను సంప్రదిస్తే మాటలతోనే సరిపెడుతున్నారని, మా కష్టాలు తీర్చండి అంటూ కాజిపల్లి గ్రామం ఎస్సీ కాలనీ గ్రామస్తులు వేడుకుంటున్నారు. పాఠశాలకు వెళ్లేందుకు పిల్లలు అవస్థలు పడుతున్నారని, బురద రోడ్డులో తామే ఎత్తుకుని ప్రధాన రోడ్డు వరకు రావాల్సిన దుస్థితి ఏర్పడుతుందని వారి తల్లిదండ్రులు వాపోతున్నారు.


ప్రధాన రహదారిపై తల్లిదండ్రుల కోసం పిల్లల ఎదురుచూపులు..

- భీమారం


కాజిపల్లిలోని ఎస్సీ కాలనీ రోడ్డు పరిస్థితి

ప్రమాదకరంగా హోల్

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వర థియేటర్ చౌరస్తాలో ప్రమాదకరంగా హోల్ ఉండగా, వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. వర్షాకాలం కావడం, రాత్రి సమయంలో హోల్ సరిగ్గా కనిపించకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరుగుతుందోననే భయం ప్రజల్లో నెలకొంది. ఇప్పటికే జిల్లా కేంద్రంలోని నాలుగు జంక్షన్ల వద్ద సుందరీకరణ పేరిట, సర్కిళ్లను నిర్మించి, రోడ్డు వెడల్పును మున్సిపల్ అధికారులు మరిచిపోగా, నాలుగు జంక్షన్ల వద్ద ఏర్పడుతున్న



గుంతలతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో గుంతలు కనిపించక, రోడ్డు ప్రమాదాలు జరిగేందుకు అవకాశం ఉండగా, ఇప్పటికైనా అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

పందుల సంచారం

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని పలు వార్డుల్లో పందులు సంచరిస్తున్నాయి. పలు కాలనీల్లోని ఓపెన్ ప్లాట్లు మురికినీటి గుంతలుగా మారుతున్నాయి. ఆ ప్లాట్లలోనే పందులు తిష్ట వేస్తుండగా, మురికి నీటితోనే కాలనీలో ఆ పందులు సంచరిస్తున్నాయి. దీంతో దోమల విజృంభణతో పాటు, మురికి నీటితో తిరిగే పందులతో దుర్వాసన వెదజల్లుతూ, ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. పందుల సంచారాన్ని అరికట్టాలని మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ వైర్లు ప్రమాదకరం


లైన్‌గడ్డకు వెళ్లే దారిలో...

చెన్నూర్: మున్సిపాలిటీ పరిధిలో విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా మారాయి. పట్టణంలోని లైన్‌గడ్డకు వెళ్లేదారిలో విద్యుత్ వైర్లు చెట్ల కొమ్మలను అంటుకొని ఉండగా, గంగపుత్ర (బెస్తవాడ) కాలనీలో విద్యుత్ వైర్లు ప్రహరీని ఆనుకొని ఉన్నాయి. అధికారులు ప్రమాదాలు జరగక ముందే స్పందించి, వెంటనే విద్యుత్ వైర్లను సరిచేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.


గంగపుత్ర కాలనీలో ఇంటి ప్రహరీ పైన వేలాడుతున్న వైర్లు

నీరు నిలిచి.. రాకపోకలకు ఇబ్బంది


రోడ్డుపై నిలిచిన వరద నీరు

బెల్లంపల్లి మున్సిపల్ రోడ్డు చిరుజల్లులకే చిత్తడిగా మారుతున్నాయి. రోడ్లపై వరద నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నా యి. రోజుల తరబడి వరద నీరు రోడ్డుపై స్థిరంగా నిలిచి ఉన్నా, కనీస చర్యలు తీసుకోవడం లేదు. ఇటీవల కురిసిన వర్షానికి మున్సిపల్ ప్రధాన రహదారిపై పలుచోట్ల వరద నీరు నిలిచింది. గుంతలు ఏర్పడిన చోట వరద నీరు మడుగులు కట్టి ఉండటంతో, వాహనదారులు, పురప్రజలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. కాంటా చౌరస్తా కలర్టు వద్ద, పాత ఫైర్ స్టేషన్ ఎదుట, ఎత్తి వేతకు గురైన సింగరేణి ఎక్స్‌ప్లోరేషన్ ప్రధాన ద్వారం ఎదుట, జమా మసీదుకు వెళ్లే క్రాస్‌రోడ్ వద్ద, బూడిదగడ్డ బస్తీ క్రాస్ రోడ్డు మహాత్మాగాంధీ విగ్రహం ఎదుట, మున్సిపల్ కార్యాలయం ఎదుట, చౌడేశ్వరి జంక్షన్ వద్ద రోడ్డుపై గుంతలు ఏర్పడి వరద నీరు నిలిచింది. బజారు ఏరియా యూనియన్ బ్యాంకు ఎదుట, రైల్వేస్టేషన్ ఎదుట ఉన్న రోడ్డుపై వరద నీరు స్థిరంగా ఉంటుండటంతో పురవాసులు కష్టాలకు గురవుతున్నారు. పాకురు పట్టి ఉండటంతో జారి పడుతున్న ఘటనలు సైతం చోటు చేసుకుంటున్నాయి. వెంటనే చర్యలు తీసుకోవాలని పురప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

- బెల్లంపల్లి

పార్టీ జెండాలు.. పంటకు బెదుర్లు!

దండేపల్లి: సాధారణంగా పంట చేళల్లో బెదుర్లుగా పాత చీరలు, గడ్డితో తయారు చేసిన బొమ్మలను, పాలితిన్ కవర్లు, కవరుసంచులు కడతారు. కానీ దండేపల్లి మండలం కన్నెపల్లి సమీపంలో ఓ రైతు వినూత్నంగా వివిధ పార్టీల జెండాలను, తన వరినారుమడి చుట్టూ పెట్టారు. దీంతో గాలికి అవి రెపరెపలాడటంతో, నారుమడిలో పక్షులు వాలడం లేదు. పార్టీ కార్యక్రమాలకు వినియోగించి పక్కన పెట్టిన పార్టీ



జెండాలను, ఇలా వరినారుమడి చుట్టూ పెట్టడం పలువురిని ఆకట్టుకుంటుంది.



బురద రోడ్డుపై ఎలా వెళ్లేది..?

జిల్లా వైద్యాధికార్యాలయానికి వెళ్లే దారి చిన్నపాటి వర్షానికే బురదగా మారుతోంది. కార్యాలయానికి వచ్చే ఉద్యోగులకు వాహనాలు ఉండడంతో, వారు ఎలాగోలా చేరుకుంటుండగా, నడుచుకుంటూ వచ్చే వారికి ఇబ్బందిగా మారుతోంది. అందులోనూ ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తల్లో ఎక్కువ మంది మహిళలే ఉండడంతో, వారు ఇతరత్ర వాహనాల ద్వారా గుడిపేట్ మెయిన్ రోడ్డు వరకు వచ్చి, జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయం వరకూ నడుచుకుంటూ వెళ్లాల్సి ఉంటుంది. ఇక్కడికి వెళ్లాలంటే మట్టి రోడ్డు ఉండడం, వర్షాలు పడితే అది బురదగా మారుతుండడంతో, ఆశలు, ఏఎన్‌ఎంలతో పాటు, ప్రజలకు బురద రోడ్డుపై వెళ్లడం ఇబ్బందిగా మారుతోంది.

- మంచిర్యాలటౌన్

సంక్షిప్త వార్తలు

అప్రమత్తంగా ఉండాలి

జన్నారం: కెనాల్ పాలిత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఈఈ రాథోడ్ విట్టల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాలు ఎక్కువగా ఉన్నందునా, కడెం ప్రాజెక్టు వరద గేట్ల నుంచి నీరు వదిలే అవకాశం ఉన్నందునా పశువులు, గొర్రెలు, మేకలు కెనాల్ పరిసర ప్రాంతాలకు వెళ్లకుండా చూడాలని సూచించారు.

విద్యుత్ షాక్‌తో మేకలు మృతి

భీమిని: భారీ వర్షాలతో విద్యుత్ తీగలు తెగిపడి కన్నెపల్లి మండలంలో గొల్లగట్టు గ్రామ పరిధిలో మంగళవారం రెండు మేకలు మృతిచెందాయి. కొండపర్తి రాజయ్య, రాదండి నానయ్య అనే రైతుకు చెందిన రూ.20వేల విలువ గల మేకలు మృత్యువాత పడ్డాయి. సంఘటనా స్థలాన్ని వీరాపూర్ సర్పంచ్ అశోక్ సందర్శించి, వెంటనే విద్యుత్ అధికారులతో మాట్లాడి విద్యుత్ సరఫరా నిలిపివేయించారు.

బాధిత కుటుంబాలకు చేయూత

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం రాంపూర్‌కు చెందిన బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మడిపెల్లి సత్యం సోదరుడు మల్లేశ్, నర్సింగాపూర్ గ్రామానికి చెందిన పోలింగ్ బూత్ అధ్యక్షుడు పోతుగంటి నరేశ్ తండ్రి రాజేశ్ అకాల మరణం పొందారు. ఈ క్రమంలో వీరిరువురి కుటుంబాలకు బీజేపీ కార్యకర్తలు విరాళాలు సేకరించి రూ.4,200 చొప్పున రెండు కుటుంబాలకు చెందిన బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

సోషల్ మీడియా ఇన్‌చార్జిగా సదానందం

రామకృష్ణాపూర్: జాతీయ మాల మహానాడు యూత్ విభాగం జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జిగా రామకృష్ణాపూర్ పట్టణానికి చెందిన దండు సదానందంను నియమించారు. ఈ మేరకు మంగళవారం జాతీయ మాల మహానాడు యూత్ అధ్యక్షుడు సుద్దమల్ల అశోక్‌తేజ నియామకపు ఉత్తర్వుల జారీ చేశారు. మాల సంఘం నిర్వహించే ప్రతీ కార్యక్రమాన్ని సోషల్‌మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్తానని, తద్వార సంఘం బలోపేతం కోసం కృషి చేస్తానని సదానందం పేర్కొన్నారు.

జన్నారంలో ఎడతెరిపి లేని వాన

జన్నారం: మండలంలో మంగళవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేని వర్షంతో జనజీవనం స్తంభించింది. వర్షం కారణంగా మండలంలోని గుడివాగు, కలమడుగు వాగు, జన్నారం, మహ్మదబాద్ వాగులు ఉప్పొంగాయి. రోడ్డుపై వరదనీరు పారి, రాకపోకలకు ఇబ్బందిగా మారింది. డ్రెయినేజీ వ్యవస్థ సరిగ్గా లేని కారణంగా, వరదనీరు రోడ్లపై పారింది.

సమస్యలు పట్టించుకోరా?

నెన్నెల: మండలంలోని ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నా, బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పట్టించుకోవడం లేదని గుండ్లసోమవారం ఎంపీటీసీ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దాగం రమేష్ ఆరోపించారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే సొంత మండలం నెన్నెల అయినప్పటికీ అభివృద్ధికి ఆమడ దూరం ఉందని ఆరోపించారు.

ఎమ్మెల్యేకు పంచాయతీ కార్మికుల వినతి


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు


ర్యాలీలో పాల్గొన్న పంచాయతీ కార్మికులు

బెల్లంపల్లి: మండలంలోని పంచాయతీ కార్మికులు మంగళవారం ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యకు వినతిపత్రం అందజేశారు. పంచాయతీ ఉద్యోగుల రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. డప్పు చప్పుళ్లతో ఎంపీడీవో కార్యాలయం నుంచి ఏఎంసీ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే చిన్నయ్యకు వినతిపత్రం సమర్పించి, తమ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించాలని తోడ్పాటు అందించాలని కోరారు.పంచాయతీ కార్మికులను రెగ్యులరైజ్ చేసి, కనీస వేతనం చెల్లించాలని ఇతర సమస్యలు తీర్చాలని విన్నవించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే చిన్నయ్య సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు.

చెన్నూర్‌రూరల్: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సమ్మెలో భాగంగా మంగళవారం చెన్నూర్‌లో చెన్నూర్, కోటపల్లి, వేమనపల్లి, భీమారం, జైపూర్ మండలాల పంచాయతీ కార్మికులు నిరసన ర్యాలీ చేపట్టారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ ర్యాలీలో ఐదు మండలాల కార్మికులు పాల్గొన్నారు.

నాటిన మొక్కలను సంరక్షించాలి

శ్రీరాంపూర్: మొక్కలు నాటడమే కాకుండా, వాటిని సంరక్షించడం ఎంతో ముఖ్యమని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి తెలిపారు. సీసీసీలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో మంగళవారం పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో హరితహారం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జీఎం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పూర్వ విద్యార్థుల సంఘం నాయకులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా పర్యావరణాన్ని పరిరక్షించడం కోసం మొక్కలు నాటాలన్నారు. నాటిన మొక్కలను దత్తత తీసుకొనే కార్యక్రమం ఇక్కడ చేపట్టడంపై, పూర్వ విద్యార్థులను జీఎం అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు రాపోలు విష్ణువర్ధన్ రావు, ప్రధాన కార్యదర్శి దొనికెన సమ్మయ్య, సమన్వయకర్తలు శ్రీ.రాజారెడ్డి, కే.వాణిశ్రీ, వైద్యులు జయలలిత, కిషోర్ రెడ్డి, కోశాధికారి దప్పు సమ్మయ్యతో పాటు శ్యాంసుందర్ రెడ్డి, జక్కుల మల్లేష్, కోరపు తిరుపతి, నల్ల సంపత్ తదితరులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న జీఎం సంజీవరెడ్డి

ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని వినతి

జైపూర్: మండలంలోని ఇందారం-రామారావుపేట పెద్ద చెరువు కట్ట కింది పొలాల రక్షణగా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరుతూ శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డికి మంగళవారం ఇందారం ఎంపీటీసీ-2 ఆర్కే స్వర్ణసంతోశ్ యాదవ్ వినతిపత్రం అందజేశారు. స్పందించిన జీఎం రైతుల సౌకర్యార్థం ఫెన్సింగ్ ఏర్పాటుకు కృషి చేయనున్నట్లుగా వారు పేర్కొన్నారు. ఇందులో ఇందారం, రామారావుపేట రైతులు ఉన్నారు.

సమాన ప్రాతినిధ్యం కల్పించాలని వినతి

శ్రీరాంపూర్: కార్మికుల సమస్యలపై చర్చించడానికి సేఫ్టీ కమిటీ, వర్కింగ్ కమిటీలో అన్ని జాతీయ సంఘాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించాలని నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం శ్రీరాంపూర్ ఏరియా వర్క్‌షాప్‌లో ఏఐటీయూసీ, బీఎంఎస్, హెచ్ఎమ్మెస్, ఐఎన్టీయూసీ నాయకులు డీజీఎం చంద్రశేఖర్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. గుర్తింపు సంఘం ఎన్నికల కాలపరిమితి ముగిసినందునా, అన్ని సంఘాలను సమానంగా చూడాలన్నారు. అన్ని రకాల అధికారిక సమావేశాలు, ఇతర కార్యక్రమాలకు సమానంగా ఆహ్వానించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఫిట్ సెక్రెటరీ సదానందం, బీఎంఎస్ ఫిట్ సెక్రెటరీ వినోద్ కుమార్, హెచ్ఎంఎస్ ఫిట్ సెక్రెటరీ అశోక్, నాయకులు రామస్వామి తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం ఇస్తున్న జాతీయ సంఘాల నాయకులు

■ బొగ్గుబాయి వార్తలు

ఫిట్ కమిటీల ఎన్నిక

శ్రీరాంపూర్: సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ శ్రీరాంపూర్ జీఎం కార్యాలయ నూతన ఫిట్ కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. ఫిట్ ఇన్‌చార్జిగా బాబు, శ్రీరాంపూర్ ఏరియా మహిళా అధ్యక్షురాలిగా ప్రబంధితను ఎన్నుకున్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన వారిని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డికి పరిచయం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ కేంద్ర ప్రధాన కార్యదర్శి ఆంతోటి నాగేశ్వరరావు పాల్గొని నూతన కమిటీకి సహకరించాలని జీఎంకు సూచించారు.

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని వర్క్‌షాపు అండ్ పీసీ విభాగాల ఏఐటీయూసీ ఫిట్ కమిటీలను మంగళవారం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ, ఏరియా ఉపాధ్యక్షుడు సుదర్శన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వర్క్‌షాపు ఫిట్ కమిటీ సెక్రెటరీగా చోబ్రోలు ప్రభాకరశర్మ(సీహెచ్‌పీ శర్మ) అసిస్టెంట్ సెక్రెటరీగా పారిపెల్లి రాజేశం, వైస్ ప్రెసిడెంట్‌గా మస్క భూమయ్య, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా పొన్నం శ్రీనివాస్, మాటేటి శ్రీనివాస్, ట్రెజరర్‌గా కన్నం వేణు, ట్రేడ్స్‌మెన్ ఇన్‌చార్జీలుగా హేమంత్‌కుమార్, రాజమౌళి, అంజద్, రమేష్‌తో పాటు సెక్షన్ల ఇన్‌చార్జిలను ఎన్నుకున్నారు. అలాగే ఎస్ అండ్ పీసీ విభాగం ఫిట్ సెక్రెటరీగా పారిపెల్లి సంజీవ్‌కుమార్, అసిస్టెంట్ సెక్రెటరీగా మర్రి శ్రీనివాస్, ఈర్ల భిక్షపతి, ఆర్గనైజర్‌గా గుగ్గిళ్ల తిరుపతి, ట్రెజరర్‌గా కృష్ణమూర్తిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. కార్యక్రమంలోయూనియన్ నాయకులు శ్రీనివాస్, భానయ్య, తిరుపతి, తదితరులు ఉన్నారు.

'24గంటల విద్యుత్ ఇస్తున్న ఘనత బీఆర్ఎస్‌దే'

భీమారం: వ్యవసాయరంగానికి 24గంటలపాటు నిరంతరం విద్యుత్ అందిస్తున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని మండల రైతుబంధు కో ఆర్డినేటర్ పర్తిరెడ్డి మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద మంగళవారం రైతులతో కలిసి మాట్లాడారు. ప్రజలకు అండగా ఉంటున్నది కేసీఆర్ ప్రభుత్వం అని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్‌తో పాటు మండలంలోని సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి